# ఇంటర్వ్యూ

"టక్ టక్" మని ఠీవిగా నడుస్తున్నాను. పూర్తిగా ఎయిర్ కండిషన్ చేయబడిన ఆఫీసు... ఎటు చూసినా తళతళ లాడుతూ అద్దాలు... గదులలో నేలమీద ఖరీదైన తివాచీలు...అటూ యిటూ గోడలకు ఖరీదైన అందాల చిత్రాలు... ఇక్కడ పని చేయడం ఒక వరం అనిపిస్తున్నది.

ప్యూను లేచి సలాం కొట్టి స్వింగ్ డోరు తీశాడు.

లోపల అడుగు పెట్టి ఎదురుగా కూర్చున్న వారిని 'విష్' చేశాను. వారు ముగ్గురు... ఖరీదైన కుర్చీల్లో కూర్చుని వున్నారు... పొడుగాటి బల్ల ....దానినిండా ఫోనులూ.... ఇతర సామాగ్రి ఒక ప్రక్కన టైపుమెషిను ముందు అందమైన స్టెనో....

ఆ ముగ్గురూ ఆదరంగా తలలు పంకించారు. ఒకాయన 'ప్లీజ్ టేక్ యువర్ సీట్' అన్నాడు. కూర్చున్నాను. తర్వాత నా కాగితాలన్నీ చూశారు. ఈ లోపల నేను తలవంచి తళతళలాడే నా బూట్లవంక, మరి కాస్సేపు గోడల నున్న బొమ్మలవంక చూస్తూ మాటిమాటికీ టై సవరించు కుంటూ కూర్చున్నాను. వారు కాగితాలు చూసి కొన్ని ప్రశ్నలు వేశారు. అన్నిటికీ అద్భుతంగా సమాధానాలు చెప్పాను. అంత సేపూ ఆ ముగ్గు రిలో ఒకాయన 'కుర్రాడు వండర్‌ఫుల్‌గా ఉన్నాడు. అమ్మాయినిచ్చి చేస్తే ఎంతో బాగుంటుంది' అనుకుంటున్నట్టు అనిపించింది. మరొకవ్యక్తి 'ఇలాటి కొడుకువుంటే ఎంత బాగుండేది:' అనుకుంటున్నట్టు అనిపిం చింది. మూడో వ్యక్తి 'ఇలాంటి చాకువంటి కుర్రాడు మన ఫరమ్‌లో ఉద్యోగంలో ఉంటే ఫరమ్ ఘనత, హోదా వందరెట్లు పెరిగిపోతాయి.' అనుకుంటున్నట్లు అనిపించింది.

"వెంటనే జాయినవుతారా?"

నేను తల వూపాను.

నిముషాలమీద స్టెనో అప్పాయింట్ మెంటు ఆర్డరు టైపుచేసి తెచ్చింది. అందుకుని చూశాను. పదిహేను వందలు జీతం....ఇతర అల వెన్సులు ఫరవాలేదనిపించింది.

"ఫారిన్ పంపిస్తే వెళ్తారా?"

"ఆలోచించి చెబుతాను."

"గుడ్...."

సంతకాలు పూర్తిచేశాము. వారు ముగ్గురూ లేచి నాతో కరచాలనం చేశారు. తర్వాత నా వెంటవచ్చి పక్క రూంకు తీసుకువెళ్ళి "ఇది మీ రూము. వస్తాం మరి... గుడ్‌లక్.." అని వెళ్ళిపోయారు. అంతా శుభ్రంగా తళతళలాడుతున్నది. పెద్ద బల్లమీద ఎంతో గొప్పఅలంకరణ ....ఖరీదైన ఆఫీసు సామాగ్రి....చల్లగా స్వర్గంలో ఉన్నట్టుగా ఉంది. కోటు విప్పి హాంగర్‌కు తగిలించి రివాల్వింగ్ కుర్చీలో కూర్చుని టై సర్దుకున్నాను. అంతలో టెలిఫోన్ 'ట్రింగ్ ట్రింగ్' మని మ్రోగడం ప్రారంభించింది.

ఎవరో తట్టి లేపుతున్నారు 'ఫోను ఫోనం'టూ ఉలిక్కిపడి లేచాను. నులకమంచం కిర్రుమన్నది. ఎదురుగా అక్కయ్య.... చేతిలో ఏదో పళ్ళెంతో నిలబడివుండి నవ్వుతూ "ఫోనంటావేమిట్రా సుబ్బూ! ఎనిమిది గంటలయింది. ఇంకా కలవరింతలా? చప్పున లే.... ఇవాళ ఇంటర్వ్యూ ఉందని మూడు రోజుల్నించీ హడావిడి చేశావు.... లేచి త్వరగా తెములు...." అంటున్నది. ఎక్కడో అందాల అంతరిక్షంలో నుంచి భూమ్మీద పడినట్టయింది.

నులకమంచం మధ్యలో బాసిపట్టువేసుకు కూర్చుని బయటికి వెళ్తున్న అక్కయ్య వంక చూశాను. అక్కయ్యకు ఇరవైఅయిదేళ్ళు నిండుతున్నాయి. పెళ్ళికాలేదు. అద్భుతంగా పాడుతుంది. మనిషి కూడా బాగానే వుంటుంది. కాని, ఏం లాభం? పెళ్ళికాలేదు. నెలకు సగటున

కనీసం ఇదరు ముగ్గురైనా రావడం, వచ్చి చూసి తర్వాత తెలియజేస్తామని వెళ్ళడం, రివాజుగా జరుగుతున్నది. పెళ్ళిచూపుల పేరుతో గొప్ప సంరంభం.... పక్క యిళ్ళలో కుర్చీలుతెచ్చి అమర్చడం.... టిఫిన్లు, కాఫీలు సరఫరా చెయ్యడం... వాళ్ళేమోచూసి తలలూపి వెళ్ళిపోవడం... తర్వాత బేరసారాలు.. ఏమీ కుదరకపోవడం... ఇదంతా గొప్ప న్యూసెన్సయిపోయింది. అక్కయ్య పాతకాలపు మనిషి కాబట్టిగాని, లేకపోతే ఎదురుతిరిగి "పెళ్ళీవొద్దు... పెటాకులూ వొద్దు... నన్ను ఇలా పడివుండనివ్వండి. వేధించక..." అని ఒక చిన్న సైజు విప్లవం సృష్టించి ఉండేది. నాకు ఉద్యోగం రావడం, అక్కయ్యకు పెళ్ళికావడం, రెండూ ఇంతలో అయ్యేట్టు లేవు. రెండూ గగన కుసుమాల్లాగే వున్నాయి.

"ఏరా సుబ్బా! ఇంకా కూర్చున్నావేరా? లేలే... నాన్నకూడా అడుగుతున్నాడు నీ గురించి..." అంటూ వొచ్చింది అక్కయ్య.

"అక్కయ్యా! ఒక్క క్షణం ఇలా కూర్చో....పొద్దున్నే నవ్వుతూ దేవతలాగా కనిపించావు. ఒక్క క్షణం మాట్లాడు" అన్నాను.

నవ్వుతూ "ఏం మాట్లాడనురా?" అన్నది అక్కయ్య.

"ఏదో ఒకటి....పోనీ ఒక పని చెయ్యి.... ఈ రెండు వేళ్ళలో ఏదో ఒకటి పట్టుకో.... ఉద్యోగం వస్తుందో రాదో తెలుసుకుందాం...."

"బాగానే వుంది నీ చాదస్తం....సరే పోనీ చూద్దాం ...కాని మనం కాదురా....బేబీని పిలుద్దాం ..." అంటూ అక్కయ్య పెద్దగా "బేబీ! బేబీ! ఇలారా, ఒక్కసారి...." అంటూ కేక పెట్టింది.

బేబీ జడ అల్లుకుంటూ "ఏమిటి?" అంటూ వచ్చింది. దాని ముఖం ఎన్నుడూ ధుమధుమలాడుతూ వుంటుంది. పెనంమీద వేగుతున్న జీడిగింజ లాగా ఎప్పుడూ చిటపటలాడుతూ వుంటుంది. ఏదో క్లాసులో అది స్నేహం చేసే వాళ్ళందరూ కార్లున్న వాళ్లు.. సంపన్నుల పిల్లలు... వాళ్ళలాగా రోజుకో డ్రస్సు వెసుకోవాలనీ, కనీసం కార్లో అయినా తిరగాలనీ, ఇవి దాని సరదాలు. పక్షవాతం వచ్చి కాలూ, చెయ్యీ పడిపోయి

మంచంలో వున్న నాన్నకు అందరికన్నా బేబీ అంటే ప్రత్యేకమైన అభిమానం.

అక్కయ్య దాన్ని కూర్చోబెట్టి "అన్నయ్య ఏదో అడుగుతున్నాడు చూడు" అన్నది నవ్వుతూ.

బేబీ నావంక తిరిగి 'ఏమిటన్న'ట్టు భ్రుకుటి ముడిచి చూసింది. నేను రెండు వ్రేళ్ళూ నుదుటి కానించుకుని ఒక్క క్షణం ఆగి దాని ముందుంచి "ఒక వేలు పట్టుకోవే బేబీ!" అన్నాను.

అది మొహం చిట్లించి మళ్ళీ అంతలో ఏమనుకున్నదో ఏమో, ఒక వేలు పట్టుకున్నది. ఒక్కసారి నేను ఆనందంతో పులకరించి పోయాను. వెంటనే లేచి దుప్పటి విసిరి అవతల పారేసి "నేను నిద్రలేచానహో" అని అరిచి వొళ్ళు విరుచుకుని అవతలి గదిలోకి వెళ్ళాను.

దొడ్లో మొహం కడుక్కుంటూ వుండగా ఎందుకో అకారణంగా మనసు బరువెక్కింది. ఇంత కష్టపడి చదువుకున్నాను. క్లాసు తెచ్చుకున్నాను. సంవత్సరం దాటిపోయింది. ఇంతవరకూ పైసా సంపాదన లేదు. ఇంట్లో ఇటీవలే మంచానపడిన తండ్రీ, పెళ్ళికాని అక్కయ్య, నా తర్వాతది పదహారేళ్ళ కమల, తర్వాత బేబీ, ఇంతమంది వున్నారు. సంవత్సరానికి అమ్మతో కలుపుకుని, ఇంకెవరెవరికో నాలుగైదు తద్దినాలున్నాయి. ఇన్నాళ్ళూ అప్పుల మీదనే గడిచింది. ఇక అప్పులు గూడా పుట్టవుగాక పుట్టవు. పైగా ఇంతకు ముందు అప్పులిచ్చిన వారు క్రమక్రమంగా ఇంటికి వచ్చి అడగటం ప్రారంభమైంది. మొన్న నాన్న స్నేహితు డొకాయన వచ్చి నిష్ఠూరంగా మాట్లాడి "మీకు డబ్బివ్వడం బుద్ధి తక్కువ అయింది" అని వెళ్ళిపోయాడు. నాన్న కళ్ళలో నీళ్ళు చూశానప్పుడు. వళ్ళు మండిపోయింది.

"ఇవ్వడం మీ బుద్ధి తక్కువయితే తీసుకోవడం మా బుద్ధి తక్కువే అయింది." అనేద్దామనిపించింది. లేకపోతే చేతికందిన దేన్నో అందుకుని బాది పారేద్దామనిపించింది. కాని తమాయించు కున్నాను. ఇంకా ఇలాంటి వెన్ని చూడాలో! ఎన్ని అనుభవించాలో! డిగ్రీ చేతికి

వచ్చిన హుషారు అణిగిపోయి చాలా కాలమైంది. రంగు రంగుల కలలు కంటూ ఊహా లోకాలలో తేలిపోతూ ఆడుతూ పాడుతూ తిరిగిన ఆ రోజులన్నీ ఎక్కడో ఎప్పుడో కరిగిపోయాయి. ఆ మధురకాలం మీద మందమైన నల్లని వాస్తవికపు తెర దిగినట్టయింది. "చాదస్తాలు తగవు. మూఢ విశ్వాసాలు తగవు. అవి తగవు... ఇవి తగవు..." అని డిబేట్లలో వాదించిన వాణ్ణి, ఇవాళ నిద్ర లేవగానే బేబీ చేత చేయించిందేమిటి?

అనవసరంగా విసుక్కుంటూ మొహం కడుక్కోవడం పూర్తిచేసి లోపలికి వచ్చాను. అక్కయ్య కుంపటి ముందు కూర్చుని కాఫీ వెచ్చబెడుతున్నది. నేను వెళ్ళి ఆమె పక్కనే కూర్చున్నాను. మరోపక్క కమల పీటమీద కూర్చుని పాత పత్రిక ఏదో తిరగేస్తున్నది. "అందరూ కాఫీలు తాగేశారు. నిన్ను గంటసేపటినుంచీ లేపుతుంటే లేవకపోతివి.... అన్నట్టు కమలా! ప్యాంటు ఆరిందేమో చూశావా? చొక్కా నిన్ననే ఉతికి మడత పెట్టి ఉంచాను." అన్నది. కమల లేచివెళ్ళి మరుక్షణంలో వచ్చి "కొంచెం తడిగానే వుందే! కాస్సేపాగితే బాగా ఆరుతుంది...." అన్నది మళ్ళీ కూర్చుంటూ.

ఈ కమల విచిత్రమైన మనిషి. అసలు ఎప్పుడూ మాట్లాడదు. లోపల ఏ ఆలోచనలు చేస్తుంటుందో ఎవరికీ తెలియదు. అత్యవసరమైతే తప్ప పెదవి కదపదు. నిశ్శబ్దంగా ఏదో ఒకటి చదువుకుంటూ కూర్చుని వుంటుంది ఎల్లప్పుడూ....

కాఫీ రెండోసారి వెచ్చబెట్టడంవల్ల కాబోలు. ఏదో కాటువాసన వేస్తున్నది. నెమ్మదిగా చప్పరిస్తూ కూర్చుని వున్నాను. అక్కయ్య ఉన్నట్టుండి "ఒరే తమ్ముడూ! ఇవాళ జాగ్రత్తగా ఉండు. వాళ్ళు అడిగిన వాటికి వినయంగా జవాబులు చెప్పు....వాళ్ళతో మన యింటి పరిస్థితులు వివరించి చెప్పు....కాస్త జాగ్రత్తరా బాబూ; ఈసారికి...." అన్నది. ఈ మాటలు అంటూ వుండగానే ఆమె కళ్ళలో నీటిపొర నిలిచింది. గొంతు గద్గదికమై పోయింది. కమల ఈ మాటలు వింటూ తల ఎత్తి చూసి మళ్ళీ పత్రిక పేజీలు తిరగేయసాగింది.

'ఊఁ' అంటూ లేచాను నేను. ముందుగదిలోకి వెళ్ళి అలమారులో క్రితం రాత్రి సరుకుని సిద్దంగా ఉంచుకున్న కాగితాలు మళ్ళీ చూసు కున్నాను. సర్టిఫికెట్లు, మార్కుల లిస్టులు, సత్ప్రవర్తనను రూఢిపరుస్తూ పెద్దలుయిచ్చిన టెస్టిమోనియల్స్, అన్నీ ఒక్కసారి తిరగేశాను. మార్కులు చూసుకుంటే గర్వం కలిగింది. చక్కని మార్కులు.... డిగ్రీకాగానే యూనివర్శిటీకివెళ్ళి పోస్టుగ్రాడ్యుయేట్ నై ఎక్కడో పెద్ద కాలేజీలో లెక్చరరుగా చేరిపోదామని ఎంతగానో కలలు కన్నాను. సూటూ బూటూ వేసుకుని, టైకట్టుకుని ఠీవిగా క్లాసులకు వెళ్ళి పాఠాలు చెబుతూ విద్యార్థి లోకంలో గొప్పపేరు సంపాయిద్దామని ఆశించాను. అసలు అంతకుముందు నా చిన్నతనంనుంచీ నాదృష్టి ఎప్పుడూ మెడిసిన్ మీద ఉండేది. డాక్టరునై తెల్లటి డ్రస్సు వేసుకుని మెడలో స్టెత్‌తో ఎల్లప్పుడు నవ్వుతూ రోగులతో ఎంతో దయగా మాట్లాడుతూ చుట్టూ తెల్లని దుస్తులలో ఉన్న రాజహంసలవంటి నర్సులతో మానవ సేవ చేద్దా మనుకున్నాను. ఏదో ఒక పల్లెపట్టున స్థిరపడి దీనజనులకు సేవచేసి తరించిపోదామనుకున్నాను. కాని, అసలు మెడిసిన్ ప్రసక్తే ఎత్తేందుకు వీల్లేకపోయింది. ఆ కలలన్నీ కల్లలైపోయి ఈనాడు మామూలు గుమాస్తా ఉద్యోగంకోసం కాళ్ళరిగేటట్టు తిరగడం తప్పనిసరి అయింది. ఎన్ని అప్లికేషన్లు పెట్టాను! కాళ్లు పట్టుకోవడం మాత్రం మినహాయించి ఎంత మంది దగ్గర ప్రాధేయపడ్డాను! చుట్టుప్రక్కల అప్పులుచేసి ఎన్ని ఇంటర్వ్యూలకు వెళ్ళాను!

అక్కయ్య లోపలికివచ్చి "ఒరే సుబ్బూ! నాన్న పిలుస్తున్నా డురా...." అన్నది.

లేచి లోపలికి వెళ్ళాను. నాన్న వెల్లకిలా పడుకుని వున్నాడు. కిటికీలో నుంచి ఆయన నడుంమీద సన్నగా గీతగీచినట్టు పలుచని ఎండ పడుతున్నది. ఆయన కళ్ళతోనే తన పక్కన కూర్చోమని సైగ చేశాడు. తర్వాత చాలాసేపు నావంక కళ్ళార్పకుండా చూశాడు. నేను దుప్పటి పోగులు లాగుతూ నిశ్శబ్దంగా కూర్చున్నాను. ఆయన ఒక్కసారి స్వాధీనంలో వున్న తన చెయ్యెత్తి నా చేతిని నిమిరాడు. ఏదో మాట్లాడు

దామని కాబోలు నోరు తెరిచాడు. గాని ఎందుకో ఏమీ చెప్పకుండా ఊరుకుండిపోయారు.

అంతలో అక్కయ్య "నువ్వు చప్పున లేచి స్నానానికి రా... ఎనిమిది గంటలవుతున్నది. ఎంతో దూరం పోవాలికూడా..." అన్నది.

నేను లేచి ఒక్కసారి నాన్న మొహంలోకి చూసి ఇవతలికి వచ్చేశాను. కమల నా ప్యాంటు మడత పెడుతున్నది. బేబీ అంతకుముందే స్కూలుకు వెళ్ళిపోయింది. అక్కయ్య "నీళ్ళుతోడాను. వెళ్ళి స్నానం చెయ్యి" అన్నది. నేను టవల్ కట్టుకుని తలకు నూనె రాచుకుని పగిలిన అద్దంలో చూసుకుంటూ తల దువ్వుకున్నాను.

ఇవాళ నా ముఖం ఎందుకో నాకే విచిత్రంగా కనిపించింది. అద్దం దగ్గరగా వుంచి చూశాను. గడ్డం కొద్దిగా మాసినట్టున్నదిగాని, అంత వికృతంగా ఏమీలేదు. కళ్ళు ఉబ్బినట్టువున్నాయి, ఎర్రని జీరలు కళ్ళ నిండా...

స్నానం ముగించి వచ్చేసరికి లోపల వాదన జరుగుతున్నది. బియ్యం తీసుకు రావాలి. ఎవరో ఒకరు క్యూలో గంటలతరబడి నిలబడి సాధించుకు రావాలి. బేబీ వంతు అయిపోయింది. అది తెల్లవారుజామునే వెళ్ళిపాలక్యూలో నిలబడి పాలు సాధించుకువచ్చి తన బాధ్యత నెరవేర్చుకుని బడికిపోయింది. ఇక ఇప్పుడు బియ్యంకోసం కమల తప్ప వెళ్ళేవారెవరూ లేరు అక్కయ్య విసుగుతో "వాడేమో ఇంటర్వ్యూకు పోవాలి మరి...నువ్వు కాదంటే ఎలాగ ?" అంటున్నది.

కమల మొహం మాడ్చుకుని, కాస్సేపు సణిగి, చివరకు తప్పనిసరయి సంచి అందుకుని రెండు రూపాయల నోటు తీసుకుని వెళ్ళిపోయింది. అది యిప్పుడు అరమైలు దూరం వరకు నడిచి పోవాలి. అక్కడ క్యూ హనుమంతుని వాలంవలె అంతులేకుండా వుంటుంది. ఆ క్యూలో నిలబడి కిలో బియ్యం సాధించుకు రావాలి...ఎంత కష్టం ! కమల మీద జాలి వేసింది నాకు.

అక్కయ్య నా కోసం ఏదో చేసింది. "మళ్ళీ ఎప్పుడొస్తావో

ఏమిటో ! కాస్త తినిపోతే మంచిది...' అన్నది. నేను తింటున్నంత సేపూ నా వంకనే చూస్తూ కూర్చున్నది. తిన్నానేకాని వెగటనిపించింది. అక్కయ్య తృప్తికోసం తినేశాను. తర్వాత వచ్చి గుడ్డలు వేసుకుని, కాయితాలన్నీ తీసుకుని, చెప్పులు తొడుక్కుని ఒక్కసారి పక్కగది లోకి వెళ్ళి "వెళ్తున్నాను నాన్నా !" అని చెప్పి రోడ్డుమీదికి వచ్చాను. అక్కయ్య వీధి గుమ్మంలోకి వచ్చి "జాగ్రత్త తమ్ముడూ!" అని నేను సందు మలుపు తిరిగేవరకూ చూసి లోపలికి వెళ్ళి పోయింది.

నడుస్తూనే ఎవరినో టైమ్ అడిగాను. తొమ్మిది గంటలయింది. సెంటరుకు వెళ్ళి బస్సుకోసం నిలబడాలి. అదెప్పుడో దయకలిగినప్పుడు వస్తుంది. దాన్లో చోటుండాలి. లేకపోతే కాళ్ళకు పని చెప్పడమే మంచిది. కాస్త అలిసిపోయినా సరిగా టైముకు చేరుకోగలం. లేకపోతే అసలు పని చెడుతుంది.

పెద్ద క్యూ ! బస్సులు ఎన్నో వస్తూపోతూ వున్నాయి. ఆకలిగొన్న రాక్షసుల్లా మనుషులను పట్టినంతమందిని కడుపుల్లో కుక్కుకుని రివ్వు, రివ్వున వెళ్ళిపోతున్నాయి.

నేను నిలబడ్డాను. .నిలబడ్డాను...ఇంతలో మనకు కావలసిన బస్సు వచ్చే సూచనలేవీ లేవు. ఎండ చిటపటలాడుతున్నది. నుదుట చెమటపడు తున్నది. తలలో ఏదోహోరు... మనసులో ఉద్వేగం ..ఆ ఉద్వేగాన్ని అణుచుకునేందుకు ఇతర విషయాల మీదికి మనసు మళ్ళిద్దామని ప్రయ త్నించాను.

క్యూలో నా ముందు నిలబడిన వారిని లెక్కపెట్టాను. మొత్తం ఇరవై అయిదు వరకూ లెక్కపెట్టేసరికి మనసు నిలవలేదు .. ఉదయం వచ్చిన కలను గుర్తుచేసుకున్నాను. ఎంత అందమైన కల అది ?... మళ్లీ అంతలో మా యింట్లో తిరుగాడే పిల్లి గుర్తుకు వచ్చింది...దూరంగా ఎవరో కుక్కను నడిపించుకు పోతున్నారు... చాలమంది కుక్కలను పెంచుతారు. కాని, నిజానికి పిల్లులే మంచివి. ఇది అందరూ ఒప్పుకోక పోవచ్చు. కాని నాకు మాత్రం పిల్లి అంటేనే ఎక్కువ ఇష్టం...కుక్కను

పెంచితే లాభాలెక్కువ ..ఈ అమ్మాయి ఎవరో బొడ్డు క్రిందకి చీరెకట్టి పొట్టి రవిక తొడిగి నిలబడివున్నది... ఎదురుగాకొట్లో ఎవరో ఫోనులో పెద్దగా అరుస్తున్నాడు. ఆ అరుపులు అవతలివారికి వినిపించేందుకు వేరే ఫోనెందుకు ? అనిపించింది...ఈ బస్సు ఖాళీగానే వచ్చిందిగాని మనకు పనికి రాదు... జనం బిలబిలలాడుతూ ఎక్కేశారు—ఆ బస్సుపొట్ట నిండిన రాక్షసుడిలా 'బేవ్' మని త్రేన్చి బయలుదేరి వెళ్ళిపోయింది .. బస్సుస్టాప్ ప్రక్కన నీడకోసం ఎవరో ధర్మాత్ములు కట్టించిన కట్టడం మీద పెద్ద అక్షరాలతో "ఫలానావారి జ్ఞాపకార్థం వారి కుమార్తు ఫలానివారి ధర్మం" అని వ్రాసివుంది. ఎదురుగా ఒక ఆడపిల్ల సైకిలు తొక్కుతూపోతున్నది.

అదుగో ! బస్సు వచ్చేసింది... ఆగింది కూడా...డ్రైవరు నల్లగా లావుగా ఉన్నాడు. సీటునిండా ఉన్నాడు. దయతలచి ఆపిన వాడిలా ఆపి అంతలోనే ముందుకు లాగించాడు. నేను ఉదుటన కమ్మీ పట్టుకుని ఎక్కేశాను. అమ్మయ్య ! ఎలా అయితేనేం ! మొత్తంమీద బస్సులో పడ్డా... నడక బాధ తప్పింది. ఒక చేతిలో కాగితాలు భద్రంగా పట్టుకుని మరో చేత్తో పడి పోకుండా పై కమ్మీ పట్టుకుని నిలబడ్డాను. టిక్కెట్టు తీసుకునే టప్పుడు మాత్రం పావలా ఖర్చయిపోతున్నదే అనిపించి మనస్సు చివుక్కుమన్నది. వెనక కొందరు కూర్చుని గల గల మాట్లాడుకుంటు న్నారు. బహుశా యూనివర్శిటీ విద్యార్థులై వుంటారు ... అందరూ ఉత్సాహంతో నిండిన బెలూన్ల లాగున్నారు. జోకులమీద జోకులు వేసు కుంటూ ఒకరిమీద ఒకరు వాలిపోతూ త్రుళ్ళిపడిపోతున్నారు. నేను వారి వంకనేచూస్తూ నిలబడ్డాను. అంతలో ఒక అమ్మాయి నా వంక చూసింది. వెంటనే మరో అమ్మాయితో నన్ను చూపించి ఏదో చెప్పింది. ఇద్దరూ నా వంక చూసి ఫక్కున నవ్వారు. 'ఏమిటా' అని నా వంక నేను చూసుకున్నాను. జేబునిండా సిరా...పెన్ను లీకవుతున్నట్టున్నది. అయ్యయ్యో ! చూసుకోనేలేదు. అరచేతి వెడల్పున జేబు పాడయింది. ఛీ ! ఛీ ! ఈ వెధవ పెన్ను తీసుకురాకపోయినా బాగుండేది....దాన్ని ఇవతలికి తీసి చేత్తో పట్టుకున్నాను. బస్సు వేగానికి గాలి విపరీతంగా వీస్తూ నున్నగా శ్రద్ధగా దువ్వుకున్న జుట్టునంతా చిందర వందర చేసింది.

దిగవలసిన స్టాపులో దిగి నడవసాగాను. అప్పుడు తెలిసింది. బస్సు ఎక్కే హడావిడిలో చెప్పు ఉంగటం తెగిందని. నవ్వువచ్చింది. అలాగే నడిచాను. ఎండలో తీక్షణత ఎక్కువై సూదులతో పొడుస్తున్న ట్టుగా ఉంది. దాహం వేస్తున్నది. పక్కనేవున్న హోటల్లోకి వెళ్ళి తాపీగా రెండు గ్లాసుల నీళ్లు తాగి ఇవతలికి వచ్చాను. తర్వాత నడక ....

అది పెద్ద ఆవరణ.... ముందు పెద్ద ఇనుపగేటు.... లోపల పెద్ద పెద్ద చెట్లు.. వాటికి పూలున్నాయా? కొన్ని ఉన్నట్టున్నాయి. మొత్తానికి అన్నీ ముసలి చెట్లు.... లోపలికి చక్కని కాలిబాటలు... ప్రక్కన చిన్న చిన్న మొక్కల వరుసలు.... భవనం బలమైన కొండరాళ్ళతో కట్టారు.... బయట బాగా వుం గాని, లోపల జైలులాగా వుంది ... పెద్ద ఆఫీసే ... లోపల చాలామందిపనిచేస్తున్నారు. బల్లలమీద కట్టలుకట్టలు కాగితాలు ... ఫైళ్ళు.... కొన్ని గదులు మరీ అడవుల్లాగా వున్నాయి.

ఒకాయనను సమీపించి మా ఇంటర్వ్యూ జరిగేదెక్కడో కనుక్కున్నాను. ఆయన మాటా పలుకూ లేకుండా కేవలం చేత్తో సైగచేసి వెళ్ళిపోయాడు.

అటువైపు వెళ్ళిచూస్తే ఒక్కసారిగా నీరసం ఆవహించి నట్టయింది. ఆ వరండాలో ఇరవై ముప్పయిమంది వరకూ ఉన్నారు.... రకరకాల వ్యక్తులు ...రకరకాల డ్రస్సుల, వయస్సుల, వాలకాలవారున్నారు. కొందరి ముఖాలలో ధైర్యం ...ధీమా ...ఎక్కువ మంది ముఖాలలో దైన్యం.... నిరాశ.... కొందరు అతి మామూలుగా ఉన్నారు. కేవలం ఇద్దరు ముగ్గురు మాత్రమే కాస్త అతిశయంగా ఉన్నారు... ఒకాయన బెంచీమీదకూర్చుని సన్నగా ఈలవేస్తున్నాడు. బహుశా జేబుడబ్బుతోనో, రికమెండేషన్లతోనో బరువుగా ఉండి ఉంటుంది. మాటిమాటికి జేబు తడువుకుంటున్నాడు కూడా.

నేను ఒకప్రక్కన గోడకానుకుని నిలబడ్డాను. ఎందుకో అంతలో మనస్సు బరువెక్కింది. మొహం రుమాలుతో తుడుచుకుని జేబులో నుంచి చిన్న దువ్వెన ఇవతలికి తీసి తలదువ్వుకున్నాను. తర్వాత నేను కూడా ఈల వేద్దామనుకున్నాను కాని వేయలేదు.

ఒక ఇరవై ఏళ్ళ యువకుడు నా దగ్గరికివచ్చి "అగ్గిపెట్టెవుందా?" అని అడిగాడు. నేను తల అడ్డంగా ఊపాను. 'పోనెండి' అంటూ తాను కూడా నా ప్రక్కనే నిలబడి "ఇంటర్వ్యూకేనా?" అని అడిగాడు.

"అవున"న్నాను.

అతడు చప్పరించి "ప్చ్! లాభంలేదండీ.... ఈ ఉద్యోగాలు మనకు రావు" అన్నాడు. మళ్ళీ నెమ్మదిగా రెండుమూడుసార్లు "లాభం లేదు....లాభంలేదు...." అని గొణిగాడు. తర్వాత కొద్దిగా మాసిన గడ్డం తడవుకున్నాడు. "ఎన్నో ప్రయత్నాలుచేశాను. యోగ్యతలూ, అర్హతలూ అన్నీ వున్నాయి. కాని శని కూడా వుంది ... ఈ ఉద్యోగాలన్నీ ఇది వరకే ఫిలప్ అయిపోయి వుంటాయి. డబ్బండీ.... అంతా డబ్బుతో నడుస్తున్నది. ప్రపంచం ...ఈ ఉద్యోగాలు కూడా రావు మనకు. అంతే" అన్నాడు మళ్ళీ.

"రాదనుకుంటూ ఇంటర్వ్యూ కెందుకు వచ్చారు?" అని అడిగాను నేను.

అతడు నవ్వి "ఇక్కడికి వచ్చేవరకూ కొంచెం ఆశ వుంది. అరగంటనుంచీ ఇక్కడ జరుగుతున్న తతంగం చూస్తూవుంటే మతి పోతున్నది. మనం గమనించంగాని పెద్ద పెద్ద కుట్రలు కళ్ళముందు జరిగిపోతుంటాయి. అదుగో! ఆ గడ్డంవాణ్ణి చూడండి. వాడు యేదో పెద్ద ప్రయత్నంలో ఉన్నాడు. ఎవరితోనో మాట్లాడటం, లోపలికి వెళ్ళడం మళ్ళీ యివతలికి రావడం. వీడికేదో చెప్పడం....ఇప్పటికిలా అయిదారు సార్లు జరిగింది. ఇప్పుడు మళ్ళీ వచ్చాడు చూడండి...." అన్నాడు.

నేను చూశాను. ఆ గడ్డంవాడు బల్లమీద కూర్చుని ఈలవేస్తున్న వ్యక్తి దగ్గరికి వెళ్ళి మాటలు కలుపుతున్నాడు. ముందు ఏదో అడిగాడు. తర్వాత సిగరెట్ ఆఫర్ చేశాడు. ఒక్క నిముషంసేపు దగ్గరగా జరిగి ఏదో మాట్లాడాడు. తర్వాత ఇద్దరూ లేచివెళ్ళి దూరంగా చెట్టుక్రింద నిలబడి మళ్ళీ మాట్లాడుకున్నారు. తర్వాత గడ్డంవాడటు వెళ్ళిపోయాడు. ఇతడు వచ్చి మళ్ళీ బల్లమీద కూర్చున్నాడు.

నా చేతి(వేళ్ళు వణుకుతున్నాయి. నా పక్కన నిలబడిన యువకుడు కళ్లు చిన్నవి చేసి చూస్తున్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడను కున్నాను. ఉన్నట్టుండి బొంగురు గొంతుకతో "ఈ దేశం బాగుపడదు... సినిమా టిక్కెట్ల దగ్గర నుంచి ఉద్యోగాల వరకూ ఆ మాటకు వస్తే మంత్రి పదవుల వరకూ ఇదే తంతు.... లాభంలేదు.... విప్లవం రావాల్సిందే....వచ్చి మొదలంటూ నాశనం అయితేకాని లాభంలేదు" అన్నాడు. తర్వాత ప్రక్కన ఎవరివో అడిగి అగ్గిపెట్టె తీసుకుని వణుకు తున్న (వేళ్ళతో సిగరెట్టు వెలిగించుకున్నాడు. మళ్లీ నా దగ్గరికి వచ్చి "రెండేళ్ళయింది....చదువై పోయి ... ఇంతవరకూ ఉద్యోగం లేదు. చాలచోట్ల ట్రై చేశాను. ఇంట్లో పరిస్థితులేమో బాగులేవు. నాన్న చచ్చి పోయాడు. పెళ్ళి కావలసిన ఆడపిల్లలూ, చదువుకోవలసిన తమ్ముళ్లూ వున్నారు...." అంటుండగా అతని గొంతు గద్గదికమయింది. అంతలో సర్దుకుని "సారీ! యేదో అనవసరంగా మాటాడుతున్నాను. ఏమీ అనుకోకండి అన్నాడు."

నేను నవ్వి "ఫరవాలేదు లెండి....నా పనీ అచ్చం అలాగేవుంది, కాకపోతే మీరు చెప్పారు. నేను చెప్పలేదు.... అంతేతేడా...."అన్నాను.

అతడూ నవ్వాడు. అంతలో నెమ్మదిగా పిలుపులు రావడం మొదలయింది. అందరూ సర్దుకుని కూర్చున్నారు. కొందరి ముఖాలలో ఆతుత....మరికొందరి ముఖాలలో ఆనందం....కొందరు వాడిపోయి వున్నారు.

లోపలికి వెళ్ళి ఇంటర్వ్యూ ముగించుకు వచ్చిన ఒక వ్యక్తి నేరుగా వెళుతున్నవాడల్లా మా దగ్గర ఆగి "మన దేశం అటంబాంబు తయారు చెయ్యాలా? వద్దా? అని అడిగితే ఏం చెప్పాలి? చెయ్యాలంటే ఒక గొడవ.... కూడదంటే ఒక గొడవ. పైగా లోపలివాళ్ళు మహా గొప్పవాళ్ళయినట్లు అనవసరంగా నవ్వుతూ మనల్ని మరింత కంగారు పెట్టేయడం.... ఈ వరసేం బాగులేదు....దారుణం...." అన్నాడు.

నా ప్రక్కన ఉన్న యువకుడు "ఎందరున్నారు లోపల" అని అడిగాడు.

"ముగ్గురు" అని చెప్పి ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు.

నాకు ఉదయం వచ్చిన కలలో కూడా నన్ను ఇంటర్వ్యూ చేసిన వారు ముగ్గురే ...నాకు అంతలో తెలియని హుషారు వచ్చింది. సన్నగా కూనిరాగం తీస్తూ నిలబడ్డాను. కాని జేబువంక చూసుకుంటే బాధ అనిపించింది అక్కయ్య ఎంతో శ్రద్ధగా ఉతికి పెట్టిన చొక్కా అనవసరంగా పాడైపోయింది...లోపల వాళ్ళుచూసి ఏమనుకుంటారో?

అలా చాలా సేపు వేచివుండవలసి వచ్చింది. ఈ లోపల ఎటన్నా పోయి కాసిని కాఫీ నీళ్ళు తాగివద్దామన్నా వీల్లేదు. ఎప్పుడు పిలుపొస్తుందో తెలియదు కదా మరి!

ఒంటిగంట వేళకు ఇంటర్వ్యూలు ఆగిపోయాయి. లంచ్ టైం అన్నారు. మిగిలినవారు మరొక గంటలో తిరిగి రావాల్సి ఉంటుందని ప్యూను పెద్దగా అరుస్తూ చెప్పాడు.

నేనూ, ఆ యువకుడూ కలిసి ఇవతలికి వచ్చి దగ్గరలో ఉన్న హోటలులో ఏదో యింత తిని కాఫీ తాగాము. ఇద్దరం ఎవరి బిల్లులు వారే ఇచ్చుకున్నాం. ఇవతలికి వచ్చాక అతడు సిగరెట్ ముట్టించాడు.

తిరిగి వచ్చి కాస్సేపు కూర్చున్న తర్వాత లోపలివారు కారులో వచ్చి దిగి లోపలికి వెళ్ళారు. ఒక పావుగంట విశ్రాంతి....మళ్ళీ పిలుపు మొదలు.

ప్యూను నా పేరు పిలవగానే ఉలిక్కిపడి లేచి కాయితాలు చేతిలోకి తీసుకుని పరుగు పరుగున వెళ్ళాను. వెనకనుంచి ఆ యువకుడు 'గుడ్‌లక్' అనడం వినిపించింది. కాని నేను వెనుదిరిగి చూడనైనా చూడలేదు.

స్ప్రింగ్‌డోరు తోసి లోపలికి అడుగుపెట్టాను. ఎదురుగాస్క్రీను....అవతల పెద్ద బల్ల....కుర్చీలలో సుఖంగా కూర్చునివున్న ముగ్గురు వ్యక్తులు....కిళ్ళీలు నములుతున్నారు. ఒకాయన మాటిమాటికీ పక్క కిటికీలోంచి ఉమ్మేస్తున్నాడు....మరొకాయన ఏకంగా కాళ్ళు జాపుకుని కూర్చునివున్నాడు. నన్ను కూర్చోమని ఎవరూ అనలేదు. నిలబడే

ఉండిపోయాను. కాగితాలు అందుకుని చూశారు. ఏవేవో అడిగారు. ఏదో చెప్పాను....నా ఇంటి పరిస్థితులు వివరించి చెప్పాలనీ, ఉద్యోగం ఎంత అవసరమో చెప్పి ప్రాధేయపడాలనీ అనుకున్నాను. కాని అంతలో ఆ ముగ్గురిలో ఒకాయనను చూస్తూవుంటే నాకు హఠాత్తుగా ఎలుగుబంటి గుర్తువచ్చింది. ఎందుకు అలా గుర్తువచ్చిందో తెలియదు. ఒక కుర్చీలో తెల్లని గుడ్డలు వేసుకుని కిళ్ళీ నములుతూ ఎలుగుబంటి కూర్చునివున్న దృశ్యం....నేను కంగారు పడుతూ చూపులు మరల్చుకున్నాను. అంతలో రెండో ఆయన ఎందుకో లేచాడు. ఆయన భారీ మనిషే. కానీ కాళ్ళూ చేతులు చాలా పొట్టివి. అంతలో నా మనసులో మరొకబొమ్మ. సముద్రాల ప్రక్కన పెంగ్విన్ అనే పక్షి ఉంటుంది. దాన్ని తెలుగులో ఏమంటారో తెలియదు... దానికి ఒళ్ళంతా ఉదరమే....గొంతునుంచి పాదాలవరకూ అంతా పొట్టే దానికి. కాళ్ళూ చేతులూ బుల్లిబుల్లివి. అచ్చుదానిలాగా ఉన్నాడీ వ్యక్తి....నాకు నవ్వు వచ్చింది. కిసుక్కున నవ్వాను. ముగ్గురు నావంక చూశారు. తర్వాత నవ్వు యింకా రావడం మొదలైంది... ఆపుకుందామనుకున్నాను .... కాని ఆ ప్రయత్నం ఫలించలేదు సరికదా నవ్వు తెరలు తెరలుగా రావడం మొదలయింది. జేబురుమాలు నోట్లో కుక్కుకుని ఆపుకోలేక లేచి మరీ నవ్వడం కొనసాగించాను.

వారు ఒకరి మొహంలోకి ఒకరు చూచుకున్నారు. "ఎందుకలా నవ్వుతావు?" అని గద్దించాడు మరొకాయన. ఆయన నేను లోపలికి వెళ్ళినప్పటి నుంచీ కదలక మెదలక కూర్చునివున్నాడు. చచ్చిపోయినతర్వాత కొందరిని కుర్చీలో కూర్చోబెట్టి అవసరమైతే నడుంకూడాపట్టుకుని శవాలకు ఫోటోలు తీయిస్తూ వుంటారు. ఈ మూడో వ్యక్తి అదేవాలకం... పైగా ఆడగొంతు.

నా నవ్వు ఆగలేదు. అలాగే లేచి కాగితాలందుకుని నవ్వుతూ ఇవతలికి వచ్చేశాను. లేకపోతే ఆ మూడో ఆయన కోపం పట్టలేక చేత్తో పట్టుకొని వున్న గాజు పేపరు వెయిట్‌తో మొహం బద్దలు కొడతాడేమో అనిపించింది. ఇవతలికి వచ్చాక దిగులు పట్టుకుంది. ఎందుకిలా ఆపుకోలేనంత నవ్వువచ్చిందీరోజున? ఒక్కొక్కప్పుడింతే, ఖర్మకొద్దీ ఇలా

జరుగుతూ వుంటుందంటే___కసీసం వచ్చేటప్పుడు ఆగి నమస్కారమన్నా చెయ్యలేదు. ఘోరం అనిపించింది. కళ్ళనిండా నవ్వువల్ల నీళ్ళుతిరిగాయి.

ఆ యువకుడు నవ్వుతూ "నావంతు వచ్చింది. త్వరలోముగించుకు వచ్చేస్తాను. ఉండండి కలిసి పోదాం...." అన్నాడు లోపలికి వెళ్తూ.

కొద్ది క్షణాలు నిశ్శబ్దం....మొహం తుడుచుకున్నాను. కళ్ళు తుడుచుకున్నాను. ఇంతలో లోపల ఏదో గొడవ ... కేకలు ....ప్యూను వున్నట్టుండి లేచి లోపలికి వెళ్లాడు.

మరుక్షణంలో ఆ యువకుడు దూసుకుని వేగంగా ఇవతలికివచ్చి "పదండి తొరగా పోదాం...." అన్నాడు.

ఇద్దరం దాదాపు పరుగెత్తుతూ రోడ్డు మీదికి వచ్చాము, ఖాళీగా వెళ్తున్న రిక్షాను ఆపి వెంటనే ఎక్కి "త్వరగా పోనియ్" అన్నాడతడు. రిక్షా రివ్వున వాలుగాలికి ప్రయాణం సాగించింది. ఫర్లాంగుదూరంవచ్చిన తర్వాత నేను ఊపిరి పీల్చుకుని అడిగాను.

"ఏం జరిగింది"

"ఏమీ లేదు ఉద్యోగం రాదన్నారు .... నాకు కోపం వచ్చింది. నిలబెట్టి కడిగేశాను. ఏమీ మిగల్చలేదు. డబ్బుతిని ఉద్యోగాలిస్తున్నారనీ, కక్కుర్తిపడుతున్నారనీ ఒకటేమిటి కడుపు మంట అంతా వెళ్ళకక్కేశాను. చివరకు "గెటవుట్" అన్నారు. కోపం ఆగక పేపరు వేయిట్ అందుకుని గోడకేసి విసిరి కొట్టాను...ఇవతలికి వచ్చేశాను... అంతే..."

సెంటర్లో దిగి రిక్షా పంపేసి ఒకరి ముఖంలోకి ఒకరం చూచుకుంటూ కొద్ది క్షణాలు నిలబడి పోయాము. ఎవరమూ ఏమీ మాట్లాడలేదు. పలుచని సాయంకాలపు బంగారు రంగు ఎండ... జనంతో నిండి కోలాహలంగా ఉన్న రోడ్డు....బస్సులరద్దీ...రంగులు... రంగులు...

ఉన్నట్టుండి అతడు చెయ్యిచాపి "వెల్! లెటజ్ పార్ట్" అన్నాడు.

నేనూ చెయ్యి అందించాను. మరుక్షణంలో ఇద్దరం చెరో వైపునా జన సముద్రంలో కలిసిపోయాము. నాకు మళ్ళీ నవ్వు వచ్చింది. ఎంత ఆపుకున్నా ఆగలేదు. ఒక చోట గోడమీద పోస్టరు చూస్తున్న మిషతో ఆగి కరువుతీరా నవ్వుకున్నాను. తర్వాత బంగారు రంగు ఎండ కెదురుగా నడవ సాగాను....ఈల వేస్తూ...